
తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

- జపాన్ పారిశ్రామిక వేత్తలతో సిఎం
- కలిసికట్టుగా అద్భుతమైన భవిష్యత్తు నిర్మిద్దామని రేవంత్ పిలుపు





జపాన్ పారిశ్రామిక వేత్తలతో ఒప్పందం కుదుర్చుకున్న పత్రాలతో సిఎం రేవంత్

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చెందాలని జపాన్ పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం పలికారు. టోక్యోలోని హెూటల్ ఇంపీరియల్‌లో జరిగిన ఇండియా-జపాన్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ రోడ్‌షోలో తెలంగాణ రాష్ట్ర అధికారిక బృందం రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించింది. వివిధ రంగాలకు చెందిన దాదాపు 150 మందికి పైగా జపాన్ పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రోడ్ షోలో మాట్లాడిన ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి జపాన్ పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడలు పెట్టేందుకు రావాలని సాదరంగా ఆహ్వానించారు. 'దేశంలోనే కొత్త రాష్ట్రం.. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణ మీకు హదయపూర్వకంగా స్వాగతం పలుకుతోంది.. జపాన్‌ను ఉదయించే సూర్యుడి దేశం అని పిలుస్తారు. మా ప్రభుత్వ నినాదం 'తెలంగాణ రైజింగ్'. ఈ రోజు తెలంగాణ జపాన్‌లో ఉదయిస్తోంది,' అన్నారు. 'టోక్యో చాలా గొప్ప నగరం. ఇక్కడి మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతం. జపాన్ ప్రజలు సౌమ్యులు, మర్యాదస్తులు, క్రమశిక్షణ కలిగినవారు. మీ నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. హైదరాబాద్‌ను అభివద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నాను,..' అని అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం గల ప్రతిభ, స్థిరమైన విధానాలను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని జపాన్ వ్యాపారవేత్తలకు మాటిచ్చారు. లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబులిటీ సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్ టైల్స్, ఏఐ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని.. భారత్, జపాన్ కలిసికట్టుగా ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భారత రాయబారి సిబి జార్జ్ భారత్-జపాన్ మధ్య బలపడుతున్న ఆర్థిక సంబంధాల గురించి మాట్లాడారు. జెట్రో (జపాన్ ఎక్స్టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుటానీ మాట్లాడుతూ.. తెలంగాణతో సహకారాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే మొదటి నెట్ జీరో ఇండస్ట్రియల్ సిటీగా హైదరాబాద్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ, దేశంలోనే అద్భుతంగా నిర్మించ తలపెట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ పై ప్రచార వీడియోలను రాష్ట్ర ప్రభుత్వం ఈ వేదికపై ప్రదర్శించింది. ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్ టైల్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో జపాన్ కంపెనీలకు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, అవకాశాలను రాష్ట్ర వాణిజ్య పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వివరించారు. రోడ్‌షో తర్వాత తెలంగాణ ప్రతినిధి బందం మరియు జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశమైంది.

రుద్రారంలో తోషిబా కొత్త ఫ్యాక్టరీ
రూ.562 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం

తోషిబా కార్పొరేషన్ యొక్క అనుబంధ సంస్థ టిటిడిఐ (ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా) తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చాయి. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం హైదరాబాద్ సమీపంలోని రుద్రారంలో టిటిడిఐ సర్జ్ అరెస్టర్స్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తుంది. వీటితో పాటు పవర్ ట్రాన్స్ఫార్మర్స్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్స్, గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్ (జిఐఎస్) తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి ఇప్పటికే అక్కడ ఉన్న ఫ్యాక్టరీలను అప్‌గ్రేడ్ చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కు రూ. 562 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించే ఈ కొత్త ఫ్యాక్టరీ విద్యుత్ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. రుద్రారంలో ఇప్పటికే రెండు ఫ్యాక్టరీలను విజయవంతంగా నిర్వహిస్తున్న టిటిడిఐ, ఈ కొత్త పెట్టుబడితో మూడో ఫ్యాక్టరీ నెలకొల్పనుంది. ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీల సామర్థ్యాన్ని విస్తరించనుంది.

టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సమక్షంలో తోషిబా కార్పొరేషన్ ఎనర్జీ బిజినెస్ డైరెక్టర్ హిరోషి కనెటా, రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్, టిటిడిఐ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ హిరోషి ఫురుటా ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక పరివర్తనలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందన్నారు. పరిశ్రమల భాగస్వామ్యాలు, వ్యూహాత్మక సహకారాలతో అన్ని రంగాల్లో ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని అన్నారు. కొత్త పెట్టుబడులకు తోషిబా చేసుకున్న ఒప్పందం పారిశ్రామిక రంగంలో కొత్త ఉత్సాహమిస్తుందని అన్నారు. టిటిడిఐ చైర్మన్ హిరోషి ఫురుటా తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు తమను ఆకట్టుకున్నాయన్నారు. కొత్త ఆవిష్కరణల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత తెలంగాణను పెట్టుబడుల గమస్థానంగా మార్చుతున్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఉత్సాహంతో ఉన్నట్లు చెప్పారు.



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు

మహిళల రక్షణకు కఠిన చట్టాలు చేయాలి

- హక్కుల సాధనకు పోరాటాలు ఉధృతం చేస్తాం
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళల భద్రత, రక్షణకు కఠిన చట్టాలు చేయాలని, హక్కుల సాధనకు పోరాటాలను ఉధృతం చేస్తామని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మహిళా హక్కుల పరిరక్షణ సాధన లక్ష్యంగా పూలే, అంబేద్కర్ ఆశయాల సాధన దిశగా ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు జాతా శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్ల సాగింది. మొదట ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకోగా జిల్లా ఐద్వా నాయకులు స్వాగతం పలికారు. అనంతరం భగత్‌సింగ్ నగర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఇక్కడి నుంచి జాతా నిర్మల్ చేరుకుంది. మినీ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. పేద బడుగు బలహీన వర్గాల స్త్రీలు చదువుకుంటే కుటుంబ సభ్యులందరూ విజ్ఞానులుగా మారుతారని అంబేద్కర్ రాజ్యాంగంలో స్త్రీకి చదువు హక్కు కల్పించారని తెలిపారు.

స్త్రీల చదువు కోసం పాఠశాలలు స్థాపించి చదువు నేర్పిన గొప్ప మూర్తి జ్యోతిబాపూలే అని తెలిపారు. వీరి ఆశయాల సాధన కోసం మహిళల హక్కుల పరిరక్షణ కోసం ఐద్వా కృషి చేస్తోందన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగినప్పుడే పాలకులు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారని, కఠిన చట్టాలు చేయాలని, ఫాస్ట్‌ట్రాక్ పోస్టుల ద్వారా త్వరగా దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న హింసను, లైంగిక వేధింపులను అరికట్టి భద్రత కల్పించాలన్నారు. అశ్లీలత వల్ల పిల్లలపై ప్రభావం పడుతోందని, రాష్ట్రంలో, దేశంలో గంజాయి, మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పౌరసరఫరాల శాఖ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని, కులాంతర వివాహాలకు రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మహిళలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల సమస్యలను అధ్యయనం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి పత్రాలు అందజేస్తామని, పరిష్కరించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కేఎన్ ఆశాలత, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోవె శకుంతల, లంక జమున, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆర్.మంజుల, జిల్లా కమిటీ సభ్యులు ప్రభావతి, లలిత, ఎన్‌పిఆర్‌డి కార్యదర్శి అరిఫాబేగం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు లంక రాఘవులు, సిఐటియు కార్యదర్శి ఎ.కిరణ్, నిర్మల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రజిత, ప్రసాద, ఉపాధ్యక్షులు సుజాత, అంగన్వాడీ యూనియన్ నాయకులు లలిత, శైలజ, ఆశా యూనియన్ నాయకులు సుజాత, చంద్రకళ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిరుపతి, దుర్గం నూతన్ కుమార్, మురళీమోహన్, గిరిజన సంఘం నాయకులు తొడసం శంభు, కేవీపీఎస్ నాయకులు పోశెట్టి పాల్గొన్నారు.

కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌తో నేడు చర్చలు

టి సాక్స్ జెఎసి ప్రతినిధుల వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టి సాక్స్ ఉద్యోగులతో శనివారం హైదరాబాద్‌లో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్ చర్చలు జరపనున్నారు. ఈ మేరకు టి సాక్స్ జెఎసి ప్రతినిధులు రంజిత్, ఎ రంజిత్‌కుమార్, టి శివప్రసాద్, సుజిత్‌గాంధీ, రమణారెడ్డి, పూజ, రాధిక, నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉద్యోగుల జెఎసి బృందం గురువారం రాత్రి కోఠిలోని టిఎస్ఎమ్ఐడిసి కార్యాలయం వద్ద వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశామని తెలిపారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ చెప్తున్న దానికి విరుద్ధంగా న్యాకో మార్గదర్శకాలకు వ్యతిరేకంగా సాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆయనకు అనుగుణంగా విధి విధానాలను తయారు చేశారని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్

- ఎన్‌టిటి డేటా, నెయిసా సంయుక్తంగా రూ. 10,500 కోట్ల పెట్టుబడులు.. సిఎం సమక్షంలో ఒప్పందాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిజిటల్ ట్రాన్ఫర్మేషన్, ఐటి సర్వీసులకు సంబంధించి ప్రపంచంలో పేరొందిన ఎన్‌టిటి డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్ వర్క్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి దాదాపు రూ. 10,500 కోట్ల పెట్టుబడితో ఈ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేందుకు ఆయా సంస్థలు త్రైపాక్షిక ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకున్నాయి. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఎన్‌టిటి డేటా, నెయిసా నెట్‌వర్క్స్ నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా, డైరెక్టర్ తడావోకి నిషిమురా, ఎన్‌టిటి గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బజ్‌పాయ్, నెయిసా సిఇఒ, ఎన్‌టిటి గ్లోబల్ డేటా చైర్మన్ షరద్ సంఘీ ఈ ఒప్పందంలో పాల్గొన్నారు. హైదరాబాద్‌లో నిర్మించబోయే ఈ సదుపాయం 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్‌కానుంది. మొత్తం 25,000 జిపియులతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఎఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను ఇది సమకూరుస్తుంది. తెలంగాణను దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఎన్‌టిటి డేటా, నెయిసా కంపెనీలు సంయుక్తంగా ఏఐ-ఫస్ట్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు ఈ క్లస్టర్ కొత్త ఆవిష్కరణల కేంద్రంగా అందరి దృష్టిని ఆకర్షించనుందని ప్రభుత్వం తెలిపింది. 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తు మిశ్రమంతో దీన్ని నిర్వహిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంబిస్తారు. ఈ ప్రాజెక్టును అత్యున్నత ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఎఐ ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదం చేయనుందని ప్రభుత్వం వివరించింది. ఈ భారీ పెట్టుబడుల ఒప్పందంపై సిఎం రేవంత్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో అనుమతులను తమ ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. వీటితోపాటు రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎడబ్ల్యూఎస్, ఎస్‌టిటి, టిల్‌మన్ హోల్డింగ్స్, సిటిఆర్ఎల్ఎస్ లాంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టిటి భారీ పెట్టుబడులతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని ఆయన వ్యాఖ్యానించారు.

కాగా టోక్యోలో ప్రధాన కార్యాలయం కలిగిన ఎన్‌టిటి డేటా... ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో పేరొందిన కంపెనీ. 50కిపైగా దేశాల్లో 1,93,000 మంది ఉద్యోగులతో, ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఈ కంపెనీ ఒకటి. పబ్లిక్ సర్వీసెస్, బిఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం వంటి రంగాలకు ఈ సంస్థ సేవలు అందిస్తోంది. నెయిసా నెట్ వర్క్ ఏఐ-ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ. నిర్దిష్ట ఏఐ కంప్యూట్ సొల్యూషన్స్‌ను అందించటంపై ఈ కంపెనీ దృష్టి సారిస్తోంది.

పంటకు మద్దతు ధర వచ్చేలా చూడాలి

- తరుగు, ఏజెంట్ కమీషన్ తగ్గించాలి
- కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలి
- మార్కెట్‌లో రైతులకు కనీస వసతులు కల్పించండి
- మాజీ ఎమ్మెల్యే జూలకంటి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర వచ్చేటట్లు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి కోరారు. మద్దతు ధర వచ్చే వరకు పంటను నిల్వ ఉంచడానికి కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌ను శుక్రవారం తెలంగాణ రైతు సంఘం నేతలు సందర్శించారు. రైతులు, కూలీలు, హమాలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌కు వచ్చిన మామిడిని పరిశీలించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. తెలంగాణలో మేలు రకం పంట దిగుబడి అధికంగా ఉంటుందని, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఎక్కువగా ఉంటుందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి గత సంవత్సరం 19 వేల టన్నుల మామిడి దిగుబడి కాగా, ఈ సంవత్సరం 23 వేల టన్నుల పంట దిగుబడి వచ్చిందని అధికారుల లెక్కల ద్వారా తెలుస్తున్నదన్నారు. ఉగాది కన్నా ముందు మామిడికి మంచి మద్దతు ధర ఉందని, కానీ నేడు టన్నుకు లక్ష నుంచి రూ.70 వేలకు పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. కేరళలో 16 రకాల పండ్ల పంటలకు ప్రభుత్వం నేరుగా మద్దతు ధర ఇస్తున్నదని, మద్దతు ధర లేని పక్షంలో ప్రభుత్వమే పంటను కొనుగోలు చేసుకొని రైతులకు మేలు చేకూరే విధంగా చర్యలు తీసుకుంటున్నదని వివరించారు. అలాంటి పద్ధతిని ఇక్కడా అమలు చేస్తే బాగుంటుందన్నారు. మార్కెట్ నిబంధనల ప్రకారం నాలుగు శాతం మాత్రమే కమీషన్ ఉండాలి కానీ పండ్లు, కూరగాయల మార్కెట్లలో ఎనిమిది శాతం నుంచి 11 శాతం వరకు కమీషన్ తీసుకుంటున్నారని తెలిపారు. అదేవిధంగా టన్నుకు క్వింటాల్ నుంచి క్వింటన్నర వరకు తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి పంటను సాగు చేస్తే సరైన దిగుబడి రాక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొన్ని సందర్భాల్లో గాలివానకు చేతికొచ్చిన మామిడి పంట కళ్ల ముందే నేలరాలిపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టబడుతున్నారన్నారు. చేతికి వచ్చిన పంటను తీసుకొని మార్కెట్లోకి వస్తే వ్యాపారస్తులు, కమీషన్‌దారులు దయా, దాక్షిణ్యాల మధ్య విక్రయించే పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి దిగుబడి వస్తోందని, రైతులకు కనీసం మద్దతు ధర ఇవ్వాలని కోరారు. రుణాలు ఇప్పించాలని, శాస్త్రీయ పద్ధతిలో పంట దిగుబడి వచ్చేటట్టు ప్రత్యేక నిపుణులను నియమించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయం సిఎం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మార్కెట్‌ను పరిశీలించిన వారిలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జంగయ్య, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, సూపర్‌వైజర్ విజయ్ తదితరులు ఉన్నారు.



మామిడి కాయలను పరిశీలిస్తున్న జూలకంటి, టి సాగర్ తదితరులు

మే 15 నాటికి ఇంజనీరింగ్ కాలేజీలకు గుర్తింపు

- జెఎన్‌టియుహెచ్ విసి, రిజిస్ట్రార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చేనెల 15 నాటికి ఇంజినీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపును ప్రకటిస్తామని జెఎన్‌టియు హైదరాబాద్ విసి టి కిషన్‌కుమార్‌రెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు చెప్పారు. శుక్రవారం వారిని కలిసిన విలేకర్లతో మాట్లాడుతూ ఇంజినీరింగ్ కాలేజీల్లో తనిఖీలు ప్రారంభమయ్యాయని అన్నారు. వచ్చేనెల మూడో తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. అనంతరం అనుబంధ గుర్తింపు ప్రక్రియను వచ్చేనెల 15 నాటికి పూర్తి చేస్తామన్నారు. ఏటా ఇంజినీరింగ్‌తోపాటు వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ఆలస్యమవుతుందని చెప్పారు. కాలేజీలకు అనుబంధ గుర్తింపును ఇవ్వడంలోనూ ఆలస్యమవుతున్నదని అన్నారు. త్వరగా గుర్తింపునిచ్చి ప్రవేశాలను చేపడతామని వివరించారు. గతేడాది అనుమతి ఉన్న కోర్సులు, సీట్ల సంఖ్య, అర్హులైన అధ్యాపకులు, ల్యాబ్‌లు, మౌలిక వసతులను పరిశీలిస్తామని చెప్పారు. నిజనిర్ధారణ కమిటీలు చేపట్టే తనిఖీల వివరాలను అందరికీ అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌తోపాటు ప్రవేశాల షెడ్యూల్‌ను కూడా వీసీల సమావేశంలో చర్చించి ప్రకటించామని గుర్తు చేశారు. దానికి అనుగుణంగా ప్రవేశాలను చేపడతామని అన్నారు. రాష్ట్రంలో 175 ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. వాటిలో 18 ప్రభుత్వ, యూనివర్సిటీలు కాలేజీలుంటే, రెండు ప్రయివేటు యూనివర్సిటీ, 155 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. జేఎన్టీయూ హైదరాబాద్ పరిధిలోనే 140 ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి.

సమాజ శాంతిని బాధ్యతగా తీసుకోవాలి

- హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలో వ్యక్తులు, సమూహాల మధ్య వచ్చే వివాదాలను శాంతియుతంగా పరిష్కరించి, శాంతియుతమైన సమాజాన్ని స్థాపించడానికి కమ్యూనిటీ పెద్దలు నడుం బిగించాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ పిలుపునిచ్చారు. హనుమకొండలో నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి ఆయా జిల్లాల న్యాయ సేవ సంస్థలు గుర్తించిన కమ్యూనిటీ మీడియేటర్ల మూడ్రోజుల శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ.. ఏ వివాదమైనా, ఒక వ్యక్తి మధ్యనో లేదా వ్యక్తి సమూహాల మధ్యనో ఏర్పడుతుందని, ఆ వ్యక్తి గాని సమూహం గాని ఏదో ఒక కమ్యూనిటీకి చెందిన వారై ఉంటారన్నారు. అటువంటి పరిస్థితిల్లో అదే కమ్యూనిటీకి చెందిన పెద్దవారు వారికి నచ్చచెబితే వివాదాలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ బృహత్తర ఆలోచన నుంచే ఉద్భవించిందే కమ్యూనిటీ మీడియేషన్ విధానమని తెలిపారు. మొదటిసారిగా కేరళ రాష్ట్రంలో ఈ విధానం విజయవంతం అయిందని, సమాజంలోని కమ్యూనిటీ పెద్దలు కోర్టుల దాకా రాకుండా వేల సంఖ్యలో వివాదాలను పరిష్కరించారన్నారు. ఆ తర్వాత ఈ విధానం మధ్యప్రదేశ్‌లోనూ అమలుచేయడంతో అక్కడా విజయవంతమైందన్నారు. కాగా, 2023లో వచ్చిన మీడియేషన్ చట్టం ఈ విధానానికి చట్టబద్ధత కల్పించిందని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఒక విశ్రాంత వైస్ ఛాన్సలర్ కమ్యూనిటీ మీడియేటర్‌గా సాధించిన విజయాలను వివరించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి మాట్లాడుతూ.. నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్‌లో ఈ కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లు విజయవంతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఏప్రిల్ ఏడవ తేదీన కామారెడ్డిలో ఒకేసారి 12 కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వీబీ నిర్మలా గీతాంబ, సీహెచ్ రమేష్ బాబు, ఇతర జిల్లాల న్యాయమూర్తులు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయి కుమార్, క్షమ దేశ్ పాండే తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఉన్నత విద్య సంస్కరణల బిల్లు

- ఎన్ఇపి కంటే మంచి విద్యావిధానాన్ని రూపొందిస్తాం
- ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉన్నత విద్య సంస్కరణల బిల్లును రూపొందిస్తున్నామని ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రయివేటు విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలపై ఉన్నత విద్యామండలికి ఎలాంటి నియంత్రణ, అధికారాల్లేవని అన్నారు. అవి తప్పు చేసినా, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసినా చర్యలు తీసుకునే అవకాశం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఈ అంశంపై సమాలోచన చేశామన్నారు. ప్రయివేటు విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలతోపాటు ప్రయివేటు విద్యాసంస్థలను నియంత్రించే అధికారంతోపాటు పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. అందులో భాగంగానే తెలంగాణ ఉన్నత విద్య సంస్కరణల బిల్లును రూపొందిస్తున్నామని వివరించారు. ఉన్నత విద్యామండలికి అధికారాలను కట్టబెడుతూ ఈ బిల్లు ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో నూతన జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ-2020) కంటే మెరుగైన విద్యావిధానాన్ని రూపొందిస్తామని వివరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకున్నా ధ్రువపత్రాలు ఇవ్వాల్సిందే

ఇంజనీరింగ్ సహా వృత్తి విద్యా కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోయినా ధ్రువపత్రాలను ఇవ్వాల్సిందేనని బాలకిష్టారెడ్డి చెప్పారు. యూజీసీ నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలను తప్పనిసరిగా విద్యార్థులకు ఇవ్వాలని అన్నారు. కొన్ని కాలేజీల యాజమాన్యాలు ధ్రువపత్రాలను ఇవ్వకుంటే విద్యార్థులు తమను ఆశ్రయిస్తే కాలేజీలతో సంప్రదించి లేఖ రాసి ఇప్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని వివరించారు. అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ప్రభుత్వ విధానమని అన్నారు. బకాయిలపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

ఎప్‌సెట్ హాల్‌టికెట్లలో 'క్యూఆర్ కోడ్'

- పరీక్షా కేంద్రానికి దూరం, చేరుకునే సమయం తెలుసుకోవచ్చు
- బాలకిష్టారెడ్డి, టికెకె రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్‌కు 3,05,774 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జెఎన్‌టియు హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, జెఎన్‌టియు హైదరాబాద్ విసి టి కిషన్‌కుమార్ రెడ్డి, ఎప్‌సెట్ కోకన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎప్‌సెట్ ఇంజనీరింగ్ విభాగానికి 2,19,420 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 86,101 మంది, రెండింటికీ 253 మంది కలిపి మొత్తం 3,05,774 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుంతో ఈ నెల 24 వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. మరో 500 మంది దరఖాస్తు చేసే అవకాశముందని చెప్పారు. ఈ నెల 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు 112 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని అన్నారు. వచ్చేనెల రెండు, మూడు, నాలుగు తేదీల్లో ఇంజనీరింగ్ విభాగం పరీక్షలను 124 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని వివరించారు. ప్రతిరోజూ రెండు విడతల్లో పరీక్షలను నిర్వహిస్మాని అన్నారు. ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రెండో విడత పరీక్షలను చేపడతామని చెప్పారు. బయోమెట్రిక్ హాజరు విధానం ఉన్నందున అభ్యర్థులను పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందునుంచే అనుమతిస్తామని అన్నారు. మొదటి విడతకు ఉదయం తొమ్మిది గంటలకు, రెండో విడతకు మధ్యాహ్నం మూడు గంటలకు నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. శనివారం నుంచి అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం అభ్యర్థులు, ఈనెల 22 నుంచి ఇంజనీరింగ్ విభాగం అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని చెప్పారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను ముందే డౌన్‌లోడ్ చేసుకోవాలనీ, ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకోవాలని సూచించారు. అభ్యర్థులు బ్లాక్/బ్లూ బాల్‌పాయింట్ పెన్ను, హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూ హైదరాబాద్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాల్లో ఎస్‌సి వర్గీకరణ అమలు చేస్తాం : బాలకిష్టారెడ్డి

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎస్‌సి వర్గీకరణను అమలు చేస్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి చెప్పారు. ఎస్‌సి వర్గీకరణకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. అన్ని ప్రవేశాల్లోనూ వర్గీకరణ అమలవుతుందని వివరించారు.

'భూ భారతి'తో భూ సమస్యలన్నింటికీ పరిష్కారం

- అబాదీ ఇళ్లకూ డాక్యుమెంట్లు
- త్వరలో టోల్‌ఫ్రీ నెంబర్
- గిరిజన ప్రాంత సమస్యలపై కమిటీ ఏర్పాటు
- ప్రతి ఒక్క రైతుకూ న్యాయం జరుగుతుంది : మంత్రి పొంగులేటి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత ప్రభుత్వం కుట్రపూరితంగా పార్ట్-బీలో పెట్టిన 18లక్షల ఎకరాల్లో 6 నుంచి 7లక్షల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయని, ఈ భూములకు భూ భారతి చట్టంతో పరిష్కారం చూపిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్‌లో మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్కతో కలిసి భూ భారతి పైలెట్ ప్రాజెక్టును పొంగులేటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కన్నీటిని తీర్చేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని అన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటివరకు రైతులు చెప్పులరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగారని, ఇప్పుడా అవసరం లేదని, అధికారులే రైతుల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఇంతవరకు డాక్యుమెంట్లు లేని అబాదీ ఇల్లు అని పిలుచుకునే నివాస గృహాలకు డాక్యుమెంట్లు ఇచ్చే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. భూ భారతి టోల్ ఫ్రీ నెంబర్‌ను త్వరలో ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. గిరిజన, గిరిజనేతరులు ఉండే ప్రాంతంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఒక కమిటీని నియమిస్తామని తెలిపారు. 2020 ధరణి చట్టంలో సాదా బైనామా అనే అంశాన్ని గత ప్రభుత్వం తొలగించిందన్నారు. సాదా బైనామా కోసం ఆన్‌లైన్‌లో పెట్టుకున్న 9.24 లక్షల దరఖాస్తుల్లో సక్రమంగా ఉన్న వాటిని పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. భూ భారతి చట్టం ద్వారా భూమిపై ఎవరైతే కాస్తులో ఉంటారో వారికే పాస్‌బుక్ ఇస్తామన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ప్రతి పేదవాడికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు భూభారతి చట్టం అమలులో రైతులకు ఏమైనా సమస్యలు వస్తే అపోహలకు, నిరాశ, నిస్పృహలకు లోనుకాకుండా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. భూభారతి చట్టంతో రైతులందరికీ న్యాయం జరుగుతుందన్నారు. మధ్యవర్తులు, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అవినీతి రహితంగా కొనసాగించాలని సూచించారు. తప్పులు చేసే అధికారులపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కాస్తులో ఉన్న నిజమైన రైతులకు భూమి హక్కు పత్రాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు పోతున్నదని తెలిపారు. రైతులు పండించిన సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడమే కాకుండా వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేసి బియ్యం రూపంలో తిరిగి ప్రజలకే ఉచితంగా అందిస్తున్నదని అన్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ రామకృష్ణారావు మాట్లాడుతూ.. భూ భారతి చట్టంపై అవగాహన కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో రైతులకు అవగాహన పెంచుతూ భూ సమస్యలను తెలుసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్, భూపాలపల్లి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, నాగరాజు, ప్రిన్సిపాల్ సెక్రటరీ సిసిఎల్‌ఎ (రెవెన్యూ) బుద్ధ ప్రకాష్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎఎస్‌పి శివం ఉపాధ్యాయ, రెవెన్యూ అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్, డిఎఫ్ఒ రాహూల్ కిషన్‌జాదవ్, రెవెన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి కిరణ్ ప్రకాష్, ఆర్‌డిఒ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతితో సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారం : మంత్రి పొంగులేటి


భూభారతి చట్టం ద్వారా రైతుల సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారమవుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా బోరజ్ మండలం పూసాయి గ్రామంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనసూయ(సీతక్క)తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు భూ భారతి చట్టం అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ చట్టంలో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, మ్యాప్ తయారీ చేసుకోవడానికి వీలుంటుందని తెలిపారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డుల్లో నమోదు చేస్తామన్నారు. మొదటగా జిల్లాలోని నాలుగు మండలాల్లో రెవెన్యూ అధికారులు రైతుల వద్దకొచ్చి భూ సమస్యలు తెలుసుకొని భూ భారతిలో పొందుపరిచి పరిష్కరిస్తారని తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్న ధరణితో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా సత్వరమే సమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి గొడెం నగేష్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు పటేల్, డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక్ తిరుపతి, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలచారి, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఎ పిఒ ఖుష్బూగుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



నవ యుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం

ప్రజాశక్తి కల్చరల్

నాడు సమాజంలో ఎన్నో అంధ విశ్వాసాలు నమ్మకాలు అలుముకున్న సమయంలో కందుకూరి వీరేశలింగం సామాజిక రుగ్మతలను సంస్కరించేందుకు ఉద్యమించారని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ అన్నారు. నవయుగ వైతాళికుడుగా కీర్తి పొందారని అయన చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా కందుకూరి వీరేశలింగం యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ బాల్యంలో వివాహం వల్ల ఎందరో యువతులు చిన్న వయస్సులో వైధవ్యం పొందారని వారికి మళ్లీ పెళ్లి చేయాలని ఉద్యమించిన గొప్ప అభ్యుదయ వాది కందుకూరి అన్నారు. హిత కారిణి పత్రికను ఆరంభించి ప్రజా చైతన్యానికి దారి చూపిన కందుకూరి నాటక కర్తగా వ్యాస కర్తగా కూడా ప్రసిద్ధుడు అన్నారు. విశ్వ సాహితి అధ్యక్షుడు డాక్టర్ బి జయ రాములు మాట్లాడుతూ తొలి తెలుగు నాటక రచయిత కందుకూరి అని అందువల్లే అయన జయంతి 16 ఏప్రిల్ తెలుగు రంగస్థల దినోత్సవంగా గుర్తింపు పొందిందని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై గాయని భమిడిపాటి ఉష పాల్గొన్నారు.



గిరి నేచర్ పోషక మిల్లెట్ స్నాక్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- హైదరాబాద్

తెలంగాణ గిరిజన సహకార సంస్థ లిమిటెడ్ (టిజిజిసిసి) కొత్తగా గిరి నేచర్ బ్రాండ్‌తో తేనె మిల్లెట్ కుకీస్, తేనె చిక్కీలను ఆవిష్కరించింది. మాసాబ్ ట్యాంక్‌లోని డిఎస్‌ఎస్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ శరత్, న్యూట్రిహబ్, ఐసిఎఆర్, ఐఎంఆర్ సిఇఒ, డైరెక్టర్ డాక్టర్ బి దయాకర్ రావు పాల్గొన్నారు. చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణకే కాకుండా గిరిజనుల జీవనోపాధికి ఈ మిల్లెట్ ఆధారిత కుకీలు, చిక్కీల తయారీ, విక్రయాలు దోహదం చేయనున్నాయని దయాకర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గిరిజన రైతులు, తయారీదారులకు మార్కెట్ అవకాశాలు కల్పించి, వారి ఉత్పత్తులు సమాజానికి ఉపయోగపడేలా వినియోగించేందుకు వీలు కల్పిస్తోన్నట్లు టిజిజిసిసి ఛైర్మన్ కొట్నాక్ తిరుపతి తెలిపారు. దీనికి సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మద్దతును అందించారని తిరుపతి పేర్కొన్నారు. తెలంగాణలోని పిల్లలకు, యువతకు ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యత గల చిరుతిళ్లు అందించాలని సిఎం ఆదేశాల మేరకు తాము ఈ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చామన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై తప్పుడు సమాచారం అప్లోడ్

- బిల్ కలెక్టర్ జగదీష్ సస్పెన్షన్

పజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై తప్పుడు సమాచారాన్ని అప్లోడ్ చేసినందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన బిల్ కలెక్టర్ జగదీష్‌ను సస్పెండ్ చేసినట్టు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఆ జిల్లాలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి బేస్‌మెంట్ వరకు నిర్మాణం జరగకుండానే, పూర్తయిందంటూ తప్పుడు సమాచారాన్ని ఇచ్చారని తెలిపారు. తమ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారిని విధుల నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారని శుక్రవారం ఈ మేరకు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

దీనిపై సంబంధిత బిల్ కలెక్టర్‌కు మెమో జారీ చేయగా పొరపాటున ఈ సమాచారాన్ని అప్లోడ్ చేసినట్టు సంజాయిషీ ఇవ్వడంతో ఆయన్ను సస్పెండ్ చేసినట్టు వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి విధుల నిర్వహణలో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నోటిఫికేషన్లు ఆపాలని చూస్తున్నారు

- ఎమ్మెల్సీ కవిత లేఖపై బల్మూరి వెంకట్ ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నాయకులు మొదటి నుంచి ఉద్యోగ నోటిఫికేషన్లు ఆపాలనే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించారు. గ్రూప్ 1పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ అందుకు నిదర్శనమని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాత, కొత్త నోటిఫికేషన్లు వేసి 57వేల ఉద్యోగాల ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తామంటూ బిఆర్ఎస్ ఎన్నికల్లో హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. దీనిపై ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ఆ సమయంలో ఎక్కడ ఉన్నారని కవితను ప్రశ్నించారు. ఆనాడు గ్రూప్1లో జరిగిన అవకతవకలపై న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తే భయంతో చేసిన తప్పును టిఎస్‌పిఎస్‌సి అధికారులపైకి తోసిందని గుర్తు చేశారు.

బిజెపికి మతం, కులం తప్ప అభివృద్ధి పట్టదు

- యువత ఉపాధి, ఉద్యోగం, అభివృద్ధిని కోరుతున్నారు...మతాన్ని కాదు : మహేష్ కుమార్ గౌడ్
- టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ ఎన్నికలతో రజకారుల రాజ్యం ఎలా సాధ్యమో ప్రజలకు సమాధానం చెప్పాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆలియాస్ కిస్మత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఇన్నేండ్ల కాలంలో రాష్ట్రానికి మీరు చేసిందేంటో చెప్పాలని నిలదీశారు. ఎన్నికలు రాగానే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ప్రేమ చిగురించడం పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు. ఎన్నికలు అయిపోగానే ఆ రెండు పార్టీలు బద్ధ శత్రువుల్లా మారినట్టు నాటకాలాడుతున్నారని విమర్శించారు. ఆ రెండు పార్టీల్లాగా రహస్య ప్రేమను నడపడం... తమకు, తమ పార్టీకి అలవాటు లేదని స్పష్టం చేశారు. 25 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎంపీగా, ఎమ్మెల్యేగా అంబర్‌పేట నియోజక వర్గానికి ఏం చేశారని నిలదీశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తామంటూ బీజేపీ పగటి కలల కంటుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ఏం చేశారో చెప్పే దమ్ముందా? అని కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. నిధుల సంగతేలా ఉన్నా...ఒక్కసారైనా రాష్ట్ర అభివృద్ధిపై ప్రధానితో మాట్లాడకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. 15 నెల్లలో కేంద్ర మంత్రిగా రాష్ట్రానికి నిధులు తీసుకరాకపోవడం పట్ల తెలంగాణ బిడ్డగా సిగ్గు అనిపించడం లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు పొద్దున లేస్తే అక్బరుద్దీన్ ఓవైసీ జపం చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. బీజేపీ నేతలకు మతం తప్ప అభివృద్ధిపై ధ్యాసే లేదని విమర్శించారు. సన్నబియ్యం లాంటి చారిత్రాత్మక నిర్ణయాలను అమలు చేస్తుంటే, కిషన్‌రెడ్డి అడుగడుగునా అడ్డుపడుతున్నారని విమర్శించారు. సన్నబియ్యం పంపిణీపై రాద్ధాంతం చేసే బదులు...బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆ పథకాన్ని అమలు చేసి రేషన్ షాపుల్లో మోడీ ఫోటో పెట్టుకోవాలని సూచించారు. కులం, మతం పేరు చెప్పి ఇంకెన్నాళ్లు పబ్బం గడుపుకుంటారని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో రహస్య ఒప్పందం నిజం కాదా? అని నిలదీశారు. సంఖ్యాబలం లేని మీరు ఎవరి అండదండలు చూసుకుని ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు. తమకు సంఖ్యా బలం లేదు కాబట్టే ఎన్నికలకు దూరంగా ఉన్నామని తెలిపారు. కుల, మతం రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు. ఎవరికి తొత్తుగా ఉండాల్సిన అవసరం తమకు లేదన్నారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ నేతలకు లేదన్నారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లపై ఎంపీ ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎంఐఎం పార్టీని అడ్డంపెట్టుకుని మతం పేరుతో రాజకీయ వ్యూహం చేయడం బీజేపీ నేతలకు అలవాటుగా మారిందన్నారు. కాంగ్రెస్‌పై ఉద్దేశ పూర్వకంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.



బిఆర్ఎస్ బహిరంగసభ ఏర్పాట్లపై కెసిఆర్ సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై ఆ పార్టీ అధ్యక్షులు, మాజీ సిఎం కెసిఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు, మహిళా నేతలకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ఎరవెల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో సభకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

మహిళల కోసం చేయాల్సిన ఏర్పాట్ల విషయంలో పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత, బిఆర్ఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఒడితల సతీష్‌కుమార్, చంద్రావతి, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, టిఎస్‌పిఎస్‌సి మాజీ సభ్యులు సుమిత్రా తనోబా, గిడ్డంగుల శాఖ మాజీ చైర్‌పర్సన్ రజినిసాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

జిహెచ్‌ఎంసి పరిధిలో పలుచోట్ల భారీ వర్షం

- రాష్ట్ర వ్యాప్తంగా 192 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 192కుపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదుకాగా...జిహెచ్‌ఎంసి పరిధిలోనే వందకుపైగా ప్రాంతాల్లో వర్షం కురవడం గమనార్హం. మొదటి 55 ప్రాంతాలు హైదరాబాద్ జిల్లాలోనే ఉన్నాయి. శుక్రవారం రాత్రి పది గంటల వరకు హైదరాబాద్ జిల్లాలోని బండ్లగూడ పరిధిలో గల కాంచన్‌బాగ్‌లో అత్యధికంగా 8.05 సెంటీమీటర్ల వాన పడింది. పదికిపైగా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. బలమైన ఈదురుగాలులు వీచాయి. దీంతో చెట్లు విరిగిపడ్డాయి. రాష్ట్రంలో శని, ఆదివారాల్లో పలు జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న ప్రకటించారు. ఈ మేరకు నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో హెచ్చరికను జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో రాబోయే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కొన్ని ప్రాంతాల్లో పడే అవకాశముందని హెచ్చరించారు. అదే సమయంలో రాబోయే మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశముంది. రాష్ట్రంలో శుక్రవారం నిజామాబాద్ జిల్లాలో 42.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నిజామాబాద్ జిల్లాలో 42.6 డిగ్రీలు నమోదైంది. ఈ ఏడాది ఇప్పటిదాకా ఇదే అత్యధికం.

హెచ్‌సియు భూములపై విచారణ

- ప్రధాని మోడీకి కెటిఆర్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంచగచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు. పర్యావరణంపై ప్రధాని తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. ఈ మేరకు కెటిఆర్ ప్రధానికి లేఖ రాశారు. రేవంత్ రెడ్డి చేసిన విధ్వంసంపై మోడీ మాట్లాడింది బూటకం కాకుంటే వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కంచ గచ్చిబౌలి అంశం కేవలం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదనీ, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.పది వేలకోట్ల ఆర్థిక మోసమని విమర్శించారు. ఇప్పటికే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సిబిఐ, ఆర్‌బిఐ, సెబీ సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్ సంస్థలకు ఆధారాలతో సహా కాంగ్రెస్ చేసిన ఆర్థిక మోసం గురించి తెలిపాయని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు పంపిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ కూడా ఈ అంశంలో ఆర్థిక అవకతవకలు జరిగిన అంశాన్ని నిర్ధారించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థల విభాగాల ద్వారా స్వతంత్ర విచారణ చేయాలని సూచించిందని చెప్పారు. నగరాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని ఈ సందర్భంగా తెలిపారు. అయితే నిసిగ్గుగా, అక్రమంగా వ్యవస్థలను మోసం చేసి పర్యావరణ విధ్వంసానికి కారణమైన రేవంత్ రెడ్డి లాంటి నాయకులను ప్రజల ముందు నిలబెట్టాల్సిన అవసరముందని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

నిజామాబాద్‌లో రైతు మహోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 21 నుంచి 23 వరకు రైతు మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఐఎఎస్ డాక్టర్ బి గోపి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యమక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు ప్రారంభిస్తారని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ రైతు మహోత్సవంలో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల రైతులు తమ పంటలను ప్రదర్శిస్తారని తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులను సైతం రైతు మహోత్సవంలో ప్రదర్శనకు ఉంచుతామని పేర్కొన్నారు.

అంబేద్కర్‌ను అవమానిస్తూ పోస్టులు

- రెండ్రోజుల్లోనే ఐదారు సంఘటనలు
- కొల్చారంలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం
- బాధ్యుల్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి : కెవిపిఎస్
- విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు: ఎస్‌పి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏప్రిల్ నెలంతా మహనీయుల జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాత్మా జ్యోతి బా పూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహనీయుల పేరిట జాతర్లు నిర్వహించుకుంటున్నారు. అందరివాడు అంబేద్కర్ అంటూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలతో పాటు ఒసిలు సైతం వేడుకల్లో పాల్గొంటున్నారు. సామాజిక తత్వవేత్తలుగా సంఘ సంస్కర్తలు, ప్రపంచ మేధావిగా ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇలాంటి మంచి వాతావరణాన్ని చెడకొట్టేందుకు కొన్ని శక్తులు కుట్రలు పన్ని అంబేద్కర్‌ను అవమానపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి విద్వేషాల్ని రెచ్చగొట్టేందుకు పూనుకుంటున్నాయి. అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయొద్దని ఒక చోట అల్లర్లు సృష్టించడం, మరి కొన్ని చోట్ల అంబేద్కర్‌ను అవమాన పరుస్తూ పోస్టులు క్రియేట్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లోనే ఐదారు చోట్ల ఇలాంటి సంఘటనలు వెలుగు చూశాయి. సంగారెడ్డి పట్టణ సమీపంలోనే రెండు చోట్ల ఇలాంటి పోస్టులు పెట్టిన విషయాలు వెలుగు చూడటంతో దళితులు, గిరిజనులు, బీసీలు సైతం పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. అప్రమత్తమైన పోలీసులు నిందితుల్ని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లగూడంకు చెందిన లాడే అరుణ్ యాదవ్, ఉత్తరపల్లికి చెందిన నాగార్జున యాదవ్ అనే యువకులు తమ ఇన్‌స్టాగ్రామ్‌లో అంబేద్కర్, చత్రపతి శివాజీ కాళ్లుమొక్కినట్టు కృత్రిమ మేథ ద్వారా ఫొటోలు క్రియేట్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో అవి వైరల్‌గా మారి వివిధ సోషల్ మీడియా గ్రూపుల్లో షేరయ్యాయి. దళిత సంఘాలు విషయాన్ని తెలుసుకుని వెంటనే పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిరసన తెలిపారు. అంబేద్కర్‌ను అవమానపరుస్తూ తప్పుడు పోస్టులు పెట్టిన వ్యక్తుల్ని అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. దాంతో పోలీసులు నిందితుల్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఉత్తరపల్లికి చెందిన యువకులు క్రియేట్ చేసిన తప్పుడు పోస్ట్‌ను మునిపల్లి మండలంలోని బుధేరలో నివాసముంటున్న ఓ వ్యక్తి కుమారుడు సెల్‌ఫోన్‌లో స్టేటస్‌గా పెట్టుకున్నాడు. ఈ విషయం కూడా వెలుగులోకి రావడంతో మునిపల్లి పోలీసులు తల్లిదండ్రుల్ని



పిలిచి క్షమాపణ చెప్పించి వదిలేశారు. ఈ రెండు సంఘటనలు మరువక ముందే 18వ తేదీన సంగారెడ్డి ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న కులబ్‌గూర్‌కు చెందిన భానుప్రసాద్ అనే యువకుడు శివాజీ, అంబేద్కర్ తలపైన చేయి వేసినట్టుగా అందుకు అంబేద్కర్.. శివాజీకి చేతులెత్తి దండం పెట్టినట్టుగా మరో పోస్ట్‌ను కృత్రిమ మేథస్సుతో క్రియేట్ చేసి వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేయడంతో వివిధ సోషల్ మీడియా గ్రూపుల్లో వైరలయింది. దాంతో చుట్టుపక్కల ఉన్న దళితులు పెద్ద ఎత్తున కులబ్‌గూర్ చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. వందలాది మంది దళిత యువకులు రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. అదే విధంగా సంగారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న చౌటకూర్ మండలంలోని వెండికోల్ గ్రామానికి ఓ యువకుడు అంబేద్కర్ విగ్రహానికి లిప్‌కిస్ పెట్టినట్టుగా ఫొటోను పోస్టుగా క్రియేట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పరారీలో ఉన్న యువకులు క్షమాపణలు చెబుతూ మరో వీడియో చేసి సోషల్ మీడియాలో పెట్టాడు. ఈ నెల 14న మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఊరి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం పెట్టడాన్ని జీర్ణించుకోలేని కొందరు ఒక గ్రూపుగా ఏర్పడి ఊర్లో అల్లర్లు సృష్టించేందుకు పూనుకున్నారు. అంబేద్కర్ విగ్రహం పెట్టిన తర్వాత దానికి ఎదురుగా జెండా పాతారు. జెండా ఉన్నందున అంబేద్కర్ విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించాలనే డిమాండ్‌ను తెరమీదికి తెచ్చి ఊర్లో వైషమ్యాలకు కారణమవుతున్నారు. కంది మండలం ఎర్దనూర్ గ్రామంలోని దళిత యువకులు, విద్యావంతులు అంబేద్కర్ విగ్రహాన్ని ఊరి సెంటర్‌లో ఏర్పాటు చేసుకుంటామని కోరితే అక్కడి పెద్దలు కొందరు ఊర్లో కాకుండా ఊరి బయట పెట్టుకోవాలని తీర్మానించి అవమానపర్చే ప్రయత్నం చేశారు.

విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు: ఎస్‌పి

కుల, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా, పోస్టులు పెట్టినా చట్టరిత్యా కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లాలో వరుసగా ఐదారు సంఘటనలు చోటు చేసుకున్న సందర్భంగా ఆయన శుక్రవారం వివిధ దళిత సంఘాల ప్రతినిధులతో తన చాంబర్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాత అని, ఆయన ఏ ఒక్క కులానికో, మతానికో, ప్రాంతానికో పరిమితమైన వారు కాదని, ఆయన దేశానికే కాకుండా ప్రపంచ దేశాలకు సైతం మార్గదర్శకంగా నిలిచారని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, చట్టాలకు లోబడి నడుచుకోవాలని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. పోలీస్ డివిజన్ల పరిధిలో గ్రామ స్థాయిలో సామాజిక సంఘాల ప్రతినిధులతో కమిటీలు వేసి కమ్యూనిటీ ప్రశాంతత గురించి అవగాహన నిర్వహిస్తామన్నారు. ఎఐ అందుబాటులో ఉన్నందున కొందరు యువత చెడు మార్గాల్లో వినియోగిస్తూ లేనివి ఉన్నట్టు వికృత ఫొటోలు తయారు చేసి పోస్టుల్ని సోషల్ మీడియాలో పెడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. అలాంటి వారిపై కేసులు పెట్టడమే కాకుండా హిస్టరీ షీట్లను ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి: కెవిపిఎస్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగా ప్రపంచ మేధావిగా పేరుగాంచారని, మహనీయుల గొప్ప చరిత్రను యువతకు అవగాహన కల్పించాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. కొన్ని శక్తులు సోషల్ మీడియాలో తప్పుడు పోస్టుల్ని క్రియేట్ చేస్తున్నందున వారిపై పోలీస్ నిఘా పెట్టి అరికట్టాలన్నారు. వరుస సంఘటనలు జరుగుతున్నందున గ్రామాల్లో సహపంక్తి భోజనం, ఇతర సామూహిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తప్పుడు పోస్టులు పెట్టిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు.